క్లుప్తంగా

నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు



మురుగు కాలువల్లో చెత్తను తొలగిస్తున్న కార్మికులు

రాజాం: పట్టణ పరిధిలో ప్రతి వార్డులో నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు వెల్లడించారు. ప్రతీ రెండు వార్డులకు ఒక బృందం ఏర్పాటు చేశామన్నారు. పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహిస్తే కార్మికులపై చర్యలు ఉంటాయని తెలిపారు. వాసవీనగర్, ఈశ్వరనారాయణకాలనీ, మాధవబజార్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను బుధవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్‌తో కలసి ఆయన పరిశీలించారు.

రక్షణపై శిక్షణ తరగతులు



శిక్షణ తీసుకున్న విద్యార్థినులతో కరాటే మాస్టర్, హెచ్‌ఎం

రాజాం: ఏపీ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్తవలస యూపీ పాఠశాలలోని విద్యార్థినిలకు బుధవారం స్వయం రక్షణ శిక్షణ తరగతులు నిర్వహించారు. రాజాం ఆర్‌ఎమ్‌ఎస్ తైక్వాండో కరాటే మాస్టర్ రేగాన శివ, ఆర్.అనూరాధ విద్యార్థినిలకు కరాటేలోని పలు అంశాలపై అవగాహన కల్పించారు. అప్పర్ పంచ్, మిడిల్ పంచ్, డౌన్ పంచ్ తదితర కృత్యాలపై శిక్షణ కల్పించి, స్వయంగా తమను తాము రక్షించుకునే విధానంపై తర్ఫీదునిచ్చారు. పాఠశాల హెచ్‌ఎం కుదమ తిరుమలరావు మాట్లాడుతూ ప్రతీ పాఠశాలలో బాలికలకు ఇటువంటి శిక్షణ ఎంతో అవసరమని, ప్రభుత్వ ప్రోత్సాహం చాలా గొప్పదని వెల్లడించారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ రాంబాబు

తెర్లాం: మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని ఈఓపీఆర్‌డీ ఆర్.రాంబాబు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంతవరకు వసూలైన ఇంటి పన్ను వివరాలను కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరులోగా ఇంటిపన్ను శతశాతం వసూలు చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు ఏఓ డీవీ అప్పారావు ఉన్నారు.

లక్ష్యాలను చేరుకోవాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న కోర్సు డైరెక్టర్ చిన్నంనాయుడు

బొబ్బిలి రూరల్: ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఉపాధి సిబ్బంది లక్ష్యాలను చేరుకోవాలని ఉపాధి హామీ పథకం కోర్స్ డైరెక్టర్ చిన్నంనాయుడు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక్కో వేతనదారు కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై ఏపీఓ జనార్దనరావు, ఈసీ శ్రీకాంత్, క్వాలిటీ కంట్రోల్ జేఈ శేషగిరి సూచనలు చేశారు.

క్షయవ్యాధి నివారణకు చర్యలు



క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

రామభద్రపురం: క్షయవ్యాధి శాశ్వత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంతోందని ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారి దీపక్‌కుమార్ అన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో బాగంగా భూసాయవలసలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల వల్ల గతంలో కంటే ప్రస్తుతం క్షయవ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గిందన్నారు. వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించేందుకు దాతలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈఓ మల్లిక్, ఏఎన్ఎంలు హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



రాజాం సిటీ: ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో పర్యవేక్షిస్తున్న సీఐ రవికుమార్



తెర్లాం: పెరుమాళి ఆదర్శ పాఠశాలలో విద్యార్థులను తనిఖీ చేసి పంపిస్తున్న పోలీసులు

ప్రథమ ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా... పోలీసులు అన్ని కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్



బొబ్బిలి: పట్టణంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



సంతకవిటి: పరీక్ష కేంద్రం వద్ద పోలీసుల తనిఖీ



తెర్లాం: పెరుమాళి ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద గదుల కేటాయింపును పరిశీలిస్తున్న విద్యార్థులు



వంగర: పరీక్ష కేంద్రం తనిఖీ చేస్తున్న తహసీల్దార్ డి.ఐజాక్

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ



తెర్లాం: మాట్లాడుతున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ



వేగావతి నదిలో పరిశీలన చేస్తున్న ప్రజారోగ్యశాఖ ఈఈ దక్షిణామూర్తి, తదితరులు

తెర్లాం: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ – సర్వీసుల అమలు, పీఎంజేఏవై కార్డుల మంజూరు, చలివేంద్రాల ఏర్పాటు, పశువుల తొట్టెలో నీరు నింపడం, రైస్‌కార్డుల విభజన, చెత్త సంపద కేంద్రాల నిర్వహణ, సచివాలయ రికార్డుల నమోదు, స్పందన గ్రీవెన్స్‌లపై సచివాలయాల వారీగా సమీక్షించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ, ఎండల నేపథ్యంలో గ్రామాల్లోని ముఖ్య కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో ఉన్న పశువుల తొట్టెల్లో నీటిని నింపాలని సూచించారు. చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీ ఆదాయ వనరులు పెంచాలన్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న ఈ సర్వీసులపై ప్రజలకు అవగాహన పెంచాలని, సర్వీసుల అమలు సంఖ్యను మరింత ఎక్కువగా నమోదు చేయాలని సూచించారు. ప్రతిరోజూ సచివాలయాల్లో, సోమవారం మండల కేంద్రంలో స్పందన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించాలన్నారు. సమీక్షలో ఆయనతో పాటు ఈఓపీఆర్‌డీ రాంబాబు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

బొబ్బిలి: వేసవిలో పట్టణ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామని ప్రజారోగ్య శాఖ ఈఈ దక్షిణామూర్తి తెలిపారు. భోజరాజపురం వద్దగల పంపింగ్ హౌస్, వేగావతి నదిని పరిశీలించారు. నీటిని నిల్వ చేసేందుకు ప్రొక్లయినర్‌తో చానల్ తవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే నదికి అడ్డంగా ఇసుక బస్తాలతో అడ్డు ఏర్పాటు చేయాలని సూచించారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

బొబ్బిలి: బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలోని బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా గంటి గోపాలకృష్ణశర్మ, తమ్మిరెడ్డి దామోదరరావు ఎన్నికయ్యారు. వీరిని న్యాయవాదులు, పట్టణవాసులు అభినందించారు.

ఘనంగా మజ్జిగౌరమ్మ ఆలయ వార్షికోత్సవం



మజ్జి గౌరమ్మను దర్శించుకుంటున్న వేణుగోపాలనాయుడు, నాయకులు

బొబ్బిలి: మున్సిపల్ పరిధి అప్పయ్యపేటలో వెలసిన మజ్జిగౌరమ్మ ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘటాల ఊరేగింపు అంగరంగవైభవంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు దర్శించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, స్థానిక కౌన్సిలర్ శ్రీలక్ష్మి, పార్టీ నాయకులు రెడ్డి దామోదరరావు, బొద్దల సత్యనారాయణ, మండల జనార్దనరావు పాల్గొన్నారు.

టీటీడీ పరిధిలోకి వేంకటేశ్వరస్వామి ఆలయం

- ఈ నెల 17న ముహూర్తం ఖరారు



వేంకటేశ్వరస్వామి ఆలయం

రాజాం సిటీ: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో ఎనిమిదేళ్ల క్రితం నిర్మించిన పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోకి వెళ్లనుంది. దీనికి సంబంధించి బుధవారం ట్రస్టు బోర్డు సభ్యులు ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. ఆలయాన్ని ఈ నెల 17న మధ్యాహ్నం 12.15 నుంచి 12.30 గంటల మధ్య అప్పగించేందుకు ముహూర్తం ఖరారైందని పేర్కొన్నారు. ఎనిమిదేళ్ల క్రితం ప్రముఖ పారిశ్రామిక వేత్త గ్రంధి మల్లిఖార్జునరావు, అతని సోదరులు బాలాజీ ట్రస్ట్ ఆధ్వర్యంలో 3.5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం చేపట్టారు. త్రిదండి చినజియర్‌స్వామి పర్యవేక్షణలో కొనసాగిన ఆలయాన్ని ఈ నెల 17న టీటీడీకి అప్పగించనున్నారు. ఇందుకు సంబంధించి టీటీడీ అధికారులు, ట్రస్టు బోర్డు సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆ రోజు ఉదయం నుంచి విశేష పూజా కార్యక్రమాలతో పాటు సాయంత్రం శ్రీనివాస కల్యాణం అనంతరం ఏకాంతసేవ చేయనున్నట్లు పేర్కొన్నారు.

19న వస్త్రధారణ పోటీలు



మాట్లాడుతున్న యంగ్‌మెన్ హ్యాపీ క్లబ్ సభ్యులు

బొబ్బిలి: రానున్న ఉగాది పండగ సందర్భంగా ఈనెల 19న సంప్రదాయ వస్త్రధారణపోటీలు నిర్వహించనున్నట్లు యంగ్‌మెన్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు మింది విజయమోహనరావు తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్థానిక మున్సిపల్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆనందో బ్రహ్మ కార్యక్రమంలో భాగంగా పలు కళా ప్రదర్శనలతో పాటు వస్త్రధారణ పోటీలు కూడా ఆరోజు సాయంత్రం నిర్వహిస్తామన్నారు. అచ్చతెలుగు సంప్రదాయ ధోరణి కనిపించేలా పంచె, చీరకట్టు, పట్టు పరికిణీలు, బాలికల సంప్రదాయ దుస్తులతో రావాలన్నారు. పోటీలో పాల్గొనేవారు ఈనెల 18లోగా తమ వివరాలను 94407 44741 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే గంగిరెద్దుల విన్యాసాలు, కర్ర సాము, పండగ విశిష్టతను తెలిపే నృత్య ప్రదర్శనలు కూడా ఉంటాయని తెలిపారు. క్లబ్ సభ్యులు డీవీ అప్పారావు, రాముద్రి గోవిందరావు, పి. నాగరాజు, ఎం. వెంకటరావు, కె.పరాంకుశం, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై అధికారుల సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

రాజాం: పట్టణంలోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న అంతకాపల్లి పంచాయతీ పరిధిలోని ఎరుకవాని చెరువును రెవెన్యూ అధికారులు బుధవారం సర్వే చేశారు. చెరువును రాజాంకు చెందిన ఓ వ్యాపారి ఆక్రమణలు చేస్తున్న అంశంపై ఈ నెల 15న సాక్షిలో ఆక్రమణల్లో గుట్టు అధికారులకే ఎరుక అనే పేరుతో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. రాజాం తహసీల్దార్ విజయభాస్కర్, సర్వేయర్ నాగేశ్వరరావు, వీఆర్‌ఓ అనంతరావు తదితరులు చెరువు వద్దకు చేరుకుని పరిశీలనలు జరిపారు. సర్వే నంబరును సరిచూసి చెరువు 20 ఎకరాలు విస్తీర్ణం ఉండాల్సి ఉండగా, ఆక్రమణలకు గురౌతున్న విషయం వాస్తవంగా గుర్తించారు. మొగిలివలస హద్దు నుంచి పొనుగుటివలస వరకూ రెండు భాగాలుగా చెరువు ఉందని, ఇటువైపు ఆక్రమణలకు గురౌతుందని అధికారులు వెల్లడించారు. ఆక్రమణలు చేసిన వారికి నోటీసులు ఇవ్వడంతో పాటు తొలగింపులు జరుపుతామని తహసీల్దార్ పేర్కొన్నారు.

కుక్కల దాడిలో బాలునికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జయసూర్య

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని చిన్నవీధిలో ఇంటి ముందు ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడు కోలా జయసూర్యపై కుక్కలు బుధవారం దాడి చేసి గాయపర్చాయి. బాలునిపై ఒక్కసారిగా కుక్కలు దాడి చేయడంతో గట్టిగా కేకలు వేశాడు. దీంతో స్థానికులు వాటిని చెదరగొట్టడంతో బాలుడుని వదిలి వెళ్లిపోయాయి. చేతికి తీవ్ర గాయమైన బాలుడిని కుటుంబ సభ్యులు రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్సనందించారు. ఇటీవల మున్సిపాల్టీలో కుక్కల స్వైర విహారం ఎక్కువైంది. వీధుల్లో గుంపులుగా కుక్కలు విహరిస్తుండడంతో చిన్నారులు ఆటలాడుకునే సమయంలో ఏం ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. దీంతో ఇటీవల సామాజిక ఆస్పత్రికి కుక్కకాటు బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

వలసల నివారణకే ‘ఉపాధి’



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ

రాజాం: మండలంలోని ఏ గ్రామంలో కూడా వలసలు లేకుండా వేతనదారులకు పూర్తి స్థాయిలో ఈ వేసవిలో పనులు కల్పించాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ లక్ష్మీపతిరాజు ఉపాధి అధికారులు, సిబ్బందికి సూచించారు. రాజాంలో ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా పనులు కల్పనతో పాటు ముందస్తు అంచనాలపై ఆరా తీశారు. పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వేతనదారులు వేసవి జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. క్లస్టర్ టీఏ హరీష్, ఏపీఓ సాయిరాం, స్థానిక టెక్నికల్ అసిస్టెంట్‌లు, పలు పంచాయతీలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పోటీతత్వంతో చదవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేంద్రనాయుడు

రామభద్రపురం: విద్యార్థులు పోటీతత్వంతో చదవాలని ఎస్సై సురేంద్రనాయుడు అన్నారు. బుధవారం స్థానిక వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నందున విద్యార్థులు ఎక్కువ సమయం చదువుకు కేటాయించాలని సూచించారు. ఎలాంటి ఆందోళనకు గురికాకుండా శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. మత్తుపదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యానికి అనర్థం వాటిల్లే ప్రమాదం ఉందని చెప్పారు. మత్తు పదార్థాల వినియోగం, మాదక ద్రవ్యాల వినియోగం నివారణపై మరింత నిఘా పెంచి పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు.

22 వేల పశువులకు టీకాలు



ఆవుకు టీకా వేస్తున్న ఏహెచ్‌ఏ

తెర్లాం: మండలంలోని 21 రైతుభరోసా కేంద్రాల పరిధిలో గల 22 వేల పశువులకు గాలికుంటు(జడుపు వ్యాధి)వ్యాధి నివారణ టీకాలు వేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని మండల పశు వైద్యాధికారి జె.నరేంద్రకుమార్ తెలిపారు. మండలంలోని విజయరాంపురం రైతుభరోసా కేంద్రం పరిధిలోని అప్పలంపేటలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నాలుగు నెలల వయసు దాటి ఉన్న పశువులకు టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. ఈ నెలాఖరు వరకు గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూర్యానారాయణ, ఏహెచ్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ముగిసిన పెదపోలమ్మ సంబరాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని శివడవలసలో పెదపోలమ్మ సంబరాలు బుధవారంతో ముగిశాయి. వేకువజాము నుంచే అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

సుధాకర్‌దే విజయం



మాట్లాడుతున్న ఎంపీపీ నాయుడు, తదితరులు

మెంటాడ: ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌దే విజయమని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, మండలంలో ఊహించని స్థాయిలో ఓటింగ్ జరిగిందని, వైఎస్సార్‌సీపీ పాలనపై ఉన్న మమకారంతోనే సీతంరాజుకు ఓట్లు చేశారని జోష్యం చెప్పారు. ఓటేసిన పట్టభద్రులకు, అధికారులు, పోలీసులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, మండల నాయకులు లెంక రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు

పేదలకు దుస్తుల పంపిణీ



గిరిజనులకు దుస్తులు పంపిణీ చేస్తున్న బీఎస్పీ నాయకులు

బొబ్బిలి రూరల్: బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరామ్ జయంతి సందర్భంగా మండలంలోని విజయపురి గ్రామంలో గిరిజనులకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. బీఎస్పీ నాయకులు సోరు సాంబయ్య, మదర్‌థెరీసా సంస్థ ప్రతినిధి కూపర్ క్లెవ్ ఆధ్వర్యంలో కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బహుజనుల అభివృద్ధికి కాన్షీరామ్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

సక్రమంగా ఉపాధి పనులు



పనులు పరిశీలిస్తున్న అధికారులు

రేగిడి: గ్రామాల్లో ఉపాధి పనులను వేతనదారులు సక్రమంగా చేసుకోవాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాధరావు అన్నారు. మండలంలోని కొర్లవలస, బాలకవివలస, సోమరాజుపేట తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వేతనదారులవద్ద పలు వివరాలు సేకరించారు. మస్టర్ వెరిఫికేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ ఎస్.హరనాధరావు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



వంగర: అన్నదానంలో పాల్గొన్న భక్తులు

వంగర: మండల పరిధి మడ్డువలస ప్రాజెక్టు ఆవరణలో వెలసిన శ్రీషిర్డీ సాయి ఆలయ 14వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు చేసి సాయినాధుని భక్తిగీతాలు ఆలపించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రాజెక్టు ఆవరణలో భారీ అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు.

పని వేళలు పాటిస్తే గిట్టుబాటు వేతనం



సంగాంలో మస్తర్లు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

వంగర: ఉపాధి హామీ పనుల్లో వేతనదారులు పని వేళలు పాటిస్తే గిట్టుబాటు వేతనం వస్తుందని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధి సంగాం సత్తర్ ట్యాంక్‌లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. పనులకు హాజరైన వేతనదారులు, ఫీల్డ్ అసిస్టెంట్ వేసిన మస్తర్లు, పని నాణ్యతను పరిశీలించారు. వేసవి దృష్ట్యా తాగునీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ రాంబాబు పాల్గొన్నారు.

21 మద్యం సీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో పోలీసులు

బొబ్బిలి: పట్టణంలోని కంచరవీధిలో మద్యం విక్రయిస్తున్న తాడుతూరి వెంకటరమణను బుధవారం అరెస్ట్ చేసి 21 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ ఆర్. జైభీమ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యం ఎవరు విక్రయించినా, తరలించినా 94409 02372 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. దాడుల్లో సిబ్బంది చంద్ర ప్రసాద్, జయరామ్, మహిళా పోలీస్ రేఖాగాయత్రి, వలంటీర్ బిందుమాధవి, తదితరులు పాల్గొన్నారు.